ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

ఆదివారం 21 సెప్టెంబరు 2025

పెరుమాళ్ ఆలయాల్లో పురటాసి పూజలు

● గోవింద నామస్మరణతో మార్మోగిన క్షేత్రాలు



శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాస పెరుమాళ్ ఆలయాల్లో పురటాసి తొలి శనివార పూజలు ఘనంగా నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గోవింద నామస్మరణతో రాష్ట్రంలోని వైష్ణవ ఆలయాలు మార్మోగాయి. వేంకటేశ్వరస్వామికి తమిళ పురటాసి మాసంలో వచ్చే నాలుగు శనివారాల్లో విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. టి.నగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆలయంలో భక్తులు తెల్లవారుజామునుంచే క్యూలైన్లలో బారులుతీరారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, అలంకారం తదితర పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. అలాగే టి.నగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా ట్రిప్లికేన్ నియోజకవర్గంలో ఉన్న పార్థసారధి స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. షావుకారుపేట ముల్లా వీధిలోని రంగనాథస్వామి ఆలయం, తిరువొత్తియూర్ కాలడిపేట పెరుమాళ్ ఆలయంలో వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో



ప్రత్యేక అలంకరణలో పార్థసారథి స్వామి

అర్చకస్వాములు తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మదురై శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయం, తిరువణ్ణామలైలోని శ్రీనివాస పెరుమాళ్ ఆలయం, కోవైలోని కారమడై రంగనాథ స్వామి ఆలయం, ఈరోడ్ జిల్లాలోని శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయాలు, కన్నియాకుమారి సముద్రతీరంలో టీటీడీ కొత్తగా నిర్మించిన వెంకటా చలపతి ఆలయంలో ఉదయం 6 గంటలకు సుప్రభాత దర్శనం, విశేషపూజలు నిర్వహించారు. చెంగల్పట్టు జిల్లాలోని తిరువిడుంధై, మహాబలిపురం, తిరువళ్లూరు, తిరునల్వేలి, తూత్తుకుడి సహా పెరుమాళ్ ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి. దర్శనం సమయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.



ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయంలో క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

మార్పులకు అనుగుణంగా విద్యాబోధన

● ఉపాధ్యాయులకు సీఎం స్టాలిన్ సూచన



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న సీఎం

ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన సాగించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచించారు. పెరియమెట్ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం స్టాలిన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో తమిళంలో వంద శాతం మార్కులు సాధించిన 142 మంది విద్యార్థిని, విద్యార్థులను అభినందిస్తూ వారికి తలా రూ.10 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తే వారు సత్ఫలితాలు సాధిస్తారన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ వాటిని విద్యార్థులకు బోధించాలని సూచించారు. అడిగిన సమాచారాన్ని గూగుల్ ఇస్తుందన్న నమ్మకంతో విద్యార్థులు ఉండకూడదని, తమ విజయానికి మూలకారకులు ఉపాధ్యాయులేనన్న వాస్తవాన్ని మర్చిపోవద్దన్నారు. విద్యార్థుల్లో ఆలోచన విధానాన్ని పెంపొందింపజేయాలని, వారికి సాహిత్యం, లౌకిక జ్ఞానం, సామాజిక భద్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై బోధించాల్సిన కర్తవ్యం ఉపాధ్యాయులదేనన్నారు. డీఎంకే మోడల్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రానికి ఘనత చేకూర్చే విధంగా ఎదుగుతున్నారన్నారు. విద్యార్థులను మానసికంగా వేధించకుండా ప్రేమతో వారికి పాఠాలను నేర్పించాలని హితవు పలికారు. ప్రతిదానికీ సాంకేతికతపై ఆధారపడడం సరి కాదని, సాంకేతికత వల్ల మనకు మేలు జరగాలి తప్ప, చెడు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపైనే వుందన్నారు.

రూ.371 కోట్లతో పాఠశాల భవనాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 59 పాఠశాలల ప్రాంగణాల్లో రూ.94 కోట్లతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించిన సీఎం.. రూ.277 కోట్లతో నిర్మించతలపెట్టిన పాఠశాల భవనాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొత్తగా ఎంపికైన టీచర్ల శిక్షణా తరగతులను కూడా ప్రారంభించారు.

మా పాలనలో 11.19 శాతం ఆర్థిక వృద్ధి

● ద్రావిడమోడల్ పాలనకు ఇదే నిదర్శనం
● విదేశీ పర్యటనతో సత్ఫలితం
● ఎన్నో సంస్థలు వస్తున్నాయ్ : సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ పాలనలో రాష్ట్రం 11.19 శాతం వృద్ధి సాధించిందని, ద్రావిడ మోడల్ తరహా పాలనకు ఇదే నిదర్శనమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం ఓ వీడియో సందేశం విడుదల చేశారు. అనేక సమస్యలు అధిగమించి తాము 11.19 శాతం వృద్ధి సాధించామన్నారు. అన్నాడీఎంకే పదేళ్ల పాలనలో సాధించలేని ఘనత ద్రవిడ నమూనా ప్రభుత్వం నాలుగేళ్లలో సాధించిందని వ్యాఖ్యానించారు. కరోనా మహమ్మారి తర్వాత, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల కంటే తమిళనాడు రికార్డు స్థాయిలో అధిక వృద్ధి సాధించిందని, అన్నాడీఎంకే పాలన కన్నా రెట్టింపు ఆర్థిక వృద్ధి సాధించామని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల్లో తాము సగటున 8.9 శాతం ఆర్థిక వృద్ధి సాధించామమని, అన్నాడీఎంకే పాలనలో సగటు ఆర్థిక వృద్ధి 2011-16లో 6.7 శాతం, 2016-21లో ఆర్థిక వృద్ధి 5.2 శాతానికి పడిపోయిందని గణాంకాలు వివరించారు. ప్రస్తుతం 11.19 శాతం ఆర్థిక వృద్ధి ద్రావిడ నమూనా ప్రభుత్వం ఎంత బాగా పనిచేస్తుందో తేటతెల్లం చేస్తుందని, విద్య, వైద్యం నాణ్యత, మౌలిక సదుపాయాలు, శాంతి భద్రతల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు. ఎగుమతుల రంగంలో రాష్ట్రం 3వ స్థానం నుంచి మొదటి స్థానానికి చేరుకుందని, అన్నాడీఎంకే పాలనలో 26 బిలియన్ డాలర్లున్న ఎగుమతి వృద్ధి డీఎంకే పాలనలో 52 మిలియన్ డాలర్లకు పెంచామని వివరించారు. విదేశాల నుంచి పెట్టుబడులు తెచ్చేందుకా? విదేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకా? అంటూ టీవీకే అధినేత వేసిన ప్రశ్నకు స్టాలిన్ పరోక్షంగా సమాధానమిచ్చారు. తన విదేశీ పర్యటన సత్ఫలితం ఇచ్చిందని, పలు విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని సీఎం వివరించారు.



రోడ్‌షోకు తరలివచ్చిన జనం - శూలాయుధంతో విజయ్

పెట్టుబడులు తెచ్చేందుకా?.. పెట్టేందుకా?

● ఆ విదేశీ పర్యటనలెందుకు సీఎం సార్
● స్టాలిన్‌ను ప్రశ్నించిన విజయ్
● నాగపట్నం జిల్లాలో ప్రచారం

చెన్నై, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): 'సీఎం గారూ! రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు వెళుతున్నారా? లేకుంటే మీ ఆదాయాన్ని పెట్టుబడి పెట్టేందుకు వెళ్తున్నారా?.. మీ విదేశీ పర్యటనలెందుకు?' అని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రశ్నించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమైన విజయ్.. ఈనెల 13న తొలి విడతగా తిరుచ్చి పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేసిన విషయం తెలిసిందే. శనివారం రెండో విడత ప్రచారంలో భాగంగా నాగపట్నం పుదూర్ జంక్షన్‌లోని అన్నాదురై విగ్రహం వద్ద రోడ్‌షో నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, ప్రజల మధ్య విజయ్ మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాగూర్ దర్గా, వేలాంకన్ని మేరిమాత, మేల్లుకడై మారియమ్మన్ ఆశీస్సులతో కడలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నాగపట్నం జాలర్ల కుటుంబాలకు తాను మిత్రుడినన్నారు. మతసామరస్యానికి అద్దంపడుతూ ఐక్యమత్యంతో జీవిస్తున్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. చేపలు, రొయ్యల ఎగుమతిలో రెండో స్థానంలో ఉన్న నాగపట్నం హార్బర్‌ను ఆధునికీకరించలేదని, తరచూ శ్రీలంక దాడులకు గురవుతున్న తమిళ జాలర్లకు రక్షణ కల్పించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు సమస్యలను పరిష్కరించాలంటూ తాను 2011 ఫిబ్రవరి 22న బహిరంగ సభ నిర్వహించానని గుర్తు చేశారు. తమిళ జాలర్లపై దాడులు చేస్తున్న శ్రీలంక ప్రభుత్వంతో చర్చించి శాశ్వత పరిష్కారం కనుగొనడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉప్పు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన వేదారణ్యం, నాగపట్నంలో ఎగుమతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మూడు దివ్యక్షేత్రాలున్న నాగపట్నం జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య మాట్లాడేందుకు తనకు ఆంక్షలు విధిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి.. ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాల సభలకు నిబంధనలు విధించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్న డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిఫలం ఆశించకుండా కష్టార్జితంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను శాసించే హక్కు ఎవరికీ లేదని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా సభలు నిర్వహించవచ్చన్నారు. సీఎం సార్ బెదిరింపులకు తాను భయపడే ప్రసక్తేలేదని, తనకు ప్రజల అండదండలు మెండుగా వున్నాయన్నారు. తన ప్రచార ఉద్యమ హోరు అధికార పార్టీ నేతలను నిద్రపోనివ్వదని, అరాచక పాలనను రాష్ట్రం నుంచి తరిమికొట్టడమే తన ప్రధాన లక్ష్యమని విజయ్ ప్రకటించారు.

26 వరకు తేలికపాటి వర్షాలు

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచి 26వ తేది వరకు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో.. దక్షిణ భారత ప్రాంతాలపై అల్ప పీడన ద్రోణి కొనసాగుతోందని, దీని కారణంగా, ఉత్తర తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ తమిళనాడులోని ఒకటి, రెండు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. 23 నుంచి 26వ తేది వరకు రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

1 నుంచి నాగేంద్రన్ రాష్ట్ర పర్యటన

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, అక్టోబరు 1 నుంచి 'మక్కలై సందిప్పు యాత్ర' ప్రారంభించనున్నారు. ఆయన పర్యటించే ప్రాంతాలను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుప్పు మురుగానందం నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ క్రమంలో, ఎన్నికలకు పార్టీ నేతలు, కార్యకర్తలను సిద్ధం చేయడం, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, డీఎంకే ప్రభుత్వ అవినీతి ప్రజలకు వివరించేలా నయినార్ నాగేంద్రన్ రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టనున్నారు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.మురుగన్ నేతృత్వంలో 'వేల్ యాత్ర', పార్లమెంటు ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అన్నామలై 'ఎన్ మన్..ఎన్ మక్కల్' పేరుతో రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టిన విషయం తెలిసిందే.

తమిళంలో వంద మార్కులు సాధిస్తే రూ.10వేలు మీ సొంతం

● మంత్రి అన్బిల్ మహేష్



ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల్లో తమిళంలో వంద మార్కులు సాధించే విద్యార్థులకు రూ.10వేలు అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ప్రకటించారు. తిరుచ్చిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... పాఠశాల విద్యాశాఖ లక్ష్యాన్ని మించి శ్రమిస్తోందని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే ధృక్పథంతో తమ శాఖ పలు పథకాలను అమలుపరుస్తోందన్నారు. 2,715 మంది డిగ్రీ టీచర్లు పాఠశాల విద్యాశాఖ కుటుంబంలో చేరి విద్యార్థులకు మంచి సలహాలిస్తున్నారని తెలిపారు. టీచర్ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం అండగా వుంటుందన్నారు. సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ టీచర్ సంఘాల తరుపున అప్పీలుకు వెళ్లడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని మంత్రి టీచర్లకు భరోసా ఇచ్చారు.

అణ్వాయుధాలు ఉపయోగించేందుకు భయపడ్డారు

● ఏబీవీపీ సదస్సులో గవర్నర్ ఆర్.ఎన్.రవి

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2014కు ముందున్న పాలకులు అణ్వాయుధాలను ఉపయోగించేందుకు భయపడ్డారని గవర్నర్ ఆర్.ఎన్.రవి విమర్శించారు. గిండిలోని మద్రాస్ ఐఐటీలో శనివారం అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ ఆర్ఎన్ రవి మాట్లాడుతూ... భారత్ అనేది ఒకే కుటుంబమని, వందకు పైగా కొమ్మలు, వేల సంఖ్యలో ఆకులున్నాయన్నారు. భారత్‌ను భాషా ప్రాతిపదికన విభజించలేమన్నారు. దేశంలో ఈశాన్య రాష్ట్రాలు ఎంతో ప్రశాంతంగా ఉండేవని, అలాంటి రాష్ట్రాల్లో ఇపుడు భాష, కుల ఘర్షణలు తలెత్తాయన్నారు. జమ్మూ కాశ్మీర్ మన దేశంలో ఒక అంతర్భాగమన్నారు. సర్దార్ పటేల్ యావత్ దేశాన్ని ఐక్యం చేశారని, కానీ, జమ్మూ కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత తీవ్రవాదులతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. 2014కు ముందున్న పాలకులు, రాజకీయ నేతలు ఇప్పుడు ఉండివుంటే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు భయపడేవారన్నారు. కానీ, ఇటీవల పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. మన ఇంజనీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు దేశ నిర్మాణం చేపట్టి యావత్ ప్రపంచానికే మార్గదర్శకులుగా ఉన్నారన్నారు. దేశంలో వెలుగు జ్యోతికి నిదర్శనం స్వామి వివేకాంద అని, భారత్ ఆత్మ ఆధ్యాత్మికమని చెప్పారు. మనకు శత్రువులు బాహ్య ప్రపంచంలోనేకాదు మన దేశంలో కూడా ఉన్నారన్నారు. భారత్ అనేది ఒక ప్రత్యేక దేశం కాదన్నారు. అదేసమయంలో దేశంలోని కొన్ని సంస్థలపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కొన్ని వ్యతిరేకశక్తుల నుంచి అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ పిలుపునిచ్చారు.



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

మంచి చేయడానికే వచ్చా...!

● ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్



పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి మంచి చేయడానికే వచ్చాను... నా లక్ష్యం పెద్దది' అంటూ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షులు కమల్ హాసన్ తెలిపారు. ఆ పార్టీ కార్యకర్తల సమావేశాలు నగరంలోని పార్టీ కార్యాలయంలో జరుగుతున్నాయి. శనివారం జరిగిన సమావేశంలో కమల్ హాసన్ మాట్లాడుతూ... కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేసేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఎంఎన్ఎం కలలను నిజం చేసే కత్తి అని, దానిని అలాగే వదిలేస్తే తుప్పుపడుతుందనే విషయం కార్యకర్తలు గ్రహించాలన్నారు. నా మొదటి శత్రువు కులం అని, మీరు ఎక్కడైనా జీవించండి, కానీ కులంతో జీవించవద్దని సూచించారు. సమావేశం అనంతరం కమల్ మీడియా తో మాట్లాడుతూ... తండ్రి తన పిల్లలను వందేళ్లు జీవించాలని కోరుకుంటారని, ఎంఎన్ఎం కూడా వందేళ్లు దాటి పనిచేయాలని ఆశపడుతున్నానన్నారు. ఎన్నికల ప్రచారంపై నేతలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని కమల్ హాసన్ తెలిపారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సిడ్కో తిరుముల్ల వాయల్ పరిధిలో సిడ్కో ఉమెన్స్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

25న 'జానపద విజ్ఞానము- ఆధునిక చూపు'

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాతీరంలోని రాజధాని కళాశాల తెలుగుశాఖ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీన 'జానపద విజ్ఞానము - ఆధునిక చూపు' అనే అంశంపై ఉపన్యాసం జరుగనుంది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామన్ ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు ఉపన్యసించనున్నారు. రాజధాని కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం.మురళి స్వాగతం పలుకనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రేపటి నుంచి ఫిషరీస్ కళాశాలల అడ్మిషన్ కౌన్సెలింగ్

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డా.జె.జయలలిత ఫిషరీస్ యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల్లో బీ.టెక్ సహా యూజీ కోర్సుల అడ్మిషన్ల కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్‌కు కాల్ లెటర్స్ పంపిన విద్యార్థుల వివరాలు, ఆయా కళాశాలల్లోని ఖాళీ సట్లు వివరాలు www.tnjfu.ac.in అనే వెబ్‌సైట్‌లో వి డుదల చేసినట్లు వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

'తల్లి' పేరుతో మొక్కలు నాటండి

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి, తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. రాష్ట్రంలోని 1,747 పాఠశాలల్లో పర్యావరణ మండలి మార్గదర్శకాల మేరకు, ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ నెల 30వ తేదిలోగా తమ తల్లి పేరు మీద ఏదో ఒక చోట ఓ మొక్క నాటాలి. మొక్క నాటే చిత్రాలను 'మొక్క నాటే పథకం 2.0 (మరమ్ నాడుమ్ తిట్టం 2.0) అనే పోర్టల్‌లో నమోదుచేసి, సర్టిఫికెట్ పొందవచ్చని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

సంపన్నుల జాబితాలో మూడో స్థానంలో రాష్ట్రం

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో సంపన్నుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం దేశంలో కోటీశ్వరుల సంఖ్య 8.71 లక్షలుంది. మెర్సిడెస్-బెంజ్ హురున్ ఇండియా సంస్థ చేపట్టిన సర్వే ఆధారంగా, 2025లో దేశంలో కోటీశ్వరులు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు మూడో స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో మిలియన్ డాలరు (భారత కరెన్సీలో రూ.8.50 కోట్లు) ఆస్తులకు పైగా ఉన్న కుటుంబాలున్నాయి. ఈ సర్వేలో మహారాష్ట్ర రాష్ట్రం 1,78,600 మంది కోటీశ్వరులతో ప్రథమ స్థానంలో ఉండగా, వారిలో ముంబైలో అత్యధికంగా 1,42,000 ఉన్నారు. అలాగే, రెండో స్థానంలో 79,800 మంది కోటీశ్వరులతో ఢిల్లీ నిలిచింది. ఇక, తమిళనాడు 72,600 మంది కోటీశ్వర్వులతో మూడో స్థానంలో నిలిచింది. వారిలో చెన్నైలో మాత్రమే 22,800 కుటుంబాలున్నాయి. అదే సమయంలో 2017లో 1.59 లక్షలున్న కోటీశ్వరుల సంఖ్య, 2021లో 4.58 లక్షలకు పెరిగింది. కానీ, గడిచిన నాలుగేళ్లలో 90 శాతం వృద్ధితో కోటీశ్వరుల సంఖ్య 8,71,700లకు పెరగడం గమనార్హం.

కళాశాలల్లో 'సీసీ కెమెరాలు'

● పోలీసు శాఖ

పెరంబూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాల ప్రాంగణాల్లో 'సీసీ కెమెరాలు' ఏర్పాటుచేయాలని పోలీసు శాఖ సూచించింది. అన్నా విశ్వవిద్యాలయంలో కొన్ని నెలల క్రితం ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన చర్చనీయాంశమైంది. దాని తర్వాత వర్సిటీ ప్రాంగణంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో, కళాశాలల్లో విద్యార్థినుల భద్రతపై దృష్టి సారించిన పోలీసులు శాఖ అన్ని విద్యా సంస్థలకు జారీచేసిన సర్క్యులర్‌లో... కళాశాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో సత్వరం కెమెరాలు ఏర్పాటుచేయాలి. దట్టమైన చెట్లు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలి. విద్యార్థినీ-విద్యార్థులు, ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది మినహా మరెవరైనా కళాశాల ప్రాంగణంలో ప్రవేశిస్తే వెంటనే వివరాలు నమోదుచేయాలని పోలీసు శాఖ ఉత్తర్వుల్లో సూచించింది.

మైనార్టీ పథకాల పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోఇ): మైనార్టీ సంక్షేమ పథకాల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ అందించడం, ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యాగ్రాం పథకం అమలు, క్రైస్తవులు జెరూసలేం తీర్థయాత్రకు వెళ్లేందుకు ఆర్థిక సాయం పలు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఈ పథకాలు అర్హులైన వారికి చేరుతున్నాయా, ఆయా జిల్లాల్లో పథకాలు అమలు తీరు తదితర అంశాల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ బృందంలో తిరుచ్చి తూర్పు ఎమ్మెల్యే ఇనిగో ఇరుదయరాజ్, తమిళనాడు వక్ఫ్ బోర్డు సభ్యుడు సుబేర్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి (అదనపు ఛార్జ్) సభ్యులుగా ఉంటారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

కుట్రాలం జలపాతంలో స్నానాలకు సమయం తగ్గింపు

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో ప్రసిద్ధి పర్యాటక ప్రాంతం కుట్రాలం జలపాతానికి ప్రతిరోజు పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఆ ప్రాంతంలోని ప్రధాన జలపాతం, పాత కుట్రాలం, ఐందరువు తదితర జలాపాతాల్లో పర్యాటకులు స్నానం చేస్తుంటారు. ఈ క్రమంలో, పాత కుట్రాలం జలపాతంలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులు స్నానాలకు అనుమతిస్తున్నారు. కొద్దిరోజులుగా పాత కుట్రాలం జలపాతం వద్ద ఎలుగు బంట్లు అధికంగా సంచరిస్తున్నాయి. దీని కారణంగా ఇక నుంచి పాత కుట్రాలం జలపాతంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకే స్నానాలకు అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

తిరుత్తణిలో కుండపోత

లోతట్టు ప్రాంతాలు జలమయం
కోశస్థలి నదిలో పెరిగిన ప్రవాహం




తిరుత్తణి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో శుక్రవారం కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరువళ్లూరు జిలా వ్యాప్తంగావున్న పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం గరిష్ఠంగా 70మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో తిరుత్తణి సమీపంలోని కోసస్థలై నదీలో వరదనీరు పెరగడంతో నదీ పరివాహక ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని కృష్ణాపురం జలాశయం నుండి వస్తున్న నీటితో పళ్లిపట్టు ప్రాంతంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో సమీపంలోని గ్రామాల ప్రజలను వరద ఉధృతి తగ్గేంతవరకు పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

అన్నింటికీ ఒకే టిక్కెట్ 'చెన్నై వన్'

● రేపు ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంటీసీ బస్సు, సబర్బన్ రైలు, మెట్రో రైళ్లలో ఇక నుంచి ఒకే టిక్కెట్టుతో ప్రయాణం చేయవచ్చు. ఈ సదుపాయాన్ని మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. నగరంలో ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రో రైళ్లలో ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. అందుకోసం బస్సుల్లో ఒక టిక్కెట్టు, రైళ్లలో వెళ్లేందుకు మరో టిక్కెట్టు తీసుకోవాల్సి వస్తుంది. ఈ విషయమై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రో రైళ్లలో ఒకే టిక్కెట్టుతో ప్రయాణించే సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం 'కుమ్టా' అనే రవాణా సంస్థ కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసి, దాని ద్వారా కొత్త యాప్ రూపొందించారు. ప్రయాణికులు బయటకు వెళ్లే సమయంలో ఏ రకం ప్రజా రవాణా సేవలు కావాలో నిర్ణయించుకుని, ఆయా మార్గాలు సూచించి, రుసుము చెల్లించి క్యూ ఆర్ కోడ్ ద్వారా మొబైల్ ఫోన్‌లో టిక్కెట్టు పొందవచ్చు. ఈ టిక్కెట్టు చూపించి బస్సు, సబర్బన్, మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు. ఈ కొత్త యాప్ ట్రయల్ రన్ సత్ఫలితాలివ్వడంతో, ఈ విధానం అమలకు రానుంది. ఈ యాప్‌కు 'చెన్నై వన్' అనే పేరు సూచించారు. ఈ కొత్త యాప్‌ను మంగళవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి మైలాపూర్‌లో నవరాత్రి వేడుకలు

● మంత్రి పీకే.శేఖర్‌బాబు

ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల ఆధ్వర్యంలో మైలాపూర్ కపాలేశ్వరర్-కర్పగాంబాళ్ కల్యాణమండపంలో సోమవారం నుండి నవరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయని ఆ శాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు ప్రకటించారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో, తమ శాఖ పరిధిలో ఇప్పటివరకు కుంభాభిషేకం జరగని ఆలయాల్లో జీర్ణోద్ధరణ పూర్తిచేసి మహాసంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు కనీస వసతులు కల్పించడంతో పాటు భక్తి, సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా మైలాపూర్‌లో భక్తులు, పలు హిందూ సంస్థల సహకారంతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని, ఈ ఏడాది 10 రోజుల ఉత్సవంలో ప్రతిరోజు భక్తిసంగీతం, నృత్యప్రదర్శన, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని మంత్రి తెలిపారు.

ఎస్‌కేపీడీలో.....: స్థానిక కొత్వాల్ బజార్ ఆదియప్ప నాయకన్ వీధిలో మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22న ప్రారంభమవుతుందని ఆలయ ట్రస్టీలు తెలిపారు. సోమవారం ఉదయం కలశ స్థాపన, ఉదయం 9 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి మూల మంత్రహోమం, విశేషపూజలతో నవరాత్రి వేడుకలు ప్రారంభిస్తారు. అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారు సరస్వతి, లక్ష్మి, శూలిని, రాజరాజేశ్వరి, బాలా, అన్నపూర్ణ, మహారాణి, దుర్గా, చండీ, మహిషాసురమర్ధిని అలంకారాల్లో పూజలందుకుంటారు. ఈ నెల 22న అమ్మవారు బంగారు రథంపై ఆలయ ప్రాంగణంలో విహరిస్తారని, నవరాత్రి పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీసులు అందుకోవాల్సిందిగా భక్తులకు ఎస్‌కేపీడీ ఛారిటీస్ సభ్యులు పిలుపునిచ్చారు.

'స్వచ్ఛ భారత్'పై అవగాహన



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మంత్రి నాజర్, కలెక్టర్ ప్రతాప్ తదితరులు

తిరుత్తణి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలో శనివారం కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. దీనికి రాష్ట్ర మైనారిటీశాఖ మంత్రి నాజర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పూందమల్లిలోని 490 మంది పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ సహాయాలు, మెడికల్ కిట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ జయకుమార్, సీఈవో మోహన్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో వైద్యుడికి గాయాలు

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా తొండాముత్తూర్ ప్రాంతంలో ఏనుగు దాడిలో వైద్యుడికి గాయాలయ్యాయి. తొండాముత్తూర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొద్దిరోజులుగా సంచరించి 13 మందిని హతమార్చిన ఏనుగును బంధించాలని అటవీ శాఖ ఆదేశించింది. ఏనుగును బంధించేందుకు అటవీ శాఖ, వెటర్నరీ వైద్యులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఏనుగుకు మత్తు ఇంజక్షన్ వేసి బంధించాలని అధికారులు నిర్ణయంచారు. ఈ క్రమంలో, ఏనుగుకు మత్తు ఇంజక్షన్‌కు ఇచ్చేందుకు సిద్ధమైన డా.విజయరాఘవన్‌పై ఏనుగు దాడిచేసింది. దీంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు.

వాల్‌పారైలో నవంబరు నుంచి ఈ-పాస్ విధానం

● హైకోర్టు ఆదేశం

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వాల్‌పారైకు వెళ్ళే పర్యాటకుల కోసం నవంబరు నుంచి ఈ-పాస్ విధానాన్ని అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైక్కెనాల్ వెళ్ళే పర్యాటకులకు ఈ-పాస్ విధానం అమలు చేస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఊటీ, కొడైక్కెనాల్ వెళ్ళేందుకు ఎన్ని వాహనాలు అనుమతించవచ్చనే అంశంపై మద్రాస్ ఐఐటీ, ఐఐఎంలకు చెందిన నిపుణుల బృందం సర్వే నిర్వహించింది. అయితే, ఈ-పాస్ విధానంపై మద్రాస్ హైకోర్టులో ఒక కేసు విచారణలో ఉంది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఎన్.సతీష్ కుమార్, టి.భరత్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సమయంలో ఐఐటీ, ఐఐఎం నిపుణుల బృందం చేసిన నివేదిక కూడా సమర్పించారు. ఇందులో కొన్ని కీలక సూచలను చేసింది. ఊటీ, కొడైక్కెనాల్ వంటి పర్యాటక ప్రాంతాలకు ఈ-పాస్ విధానాన్ని అమలు చేయడం వల్ల టూరిస్ట్ వాహనాల సంఖ్య తగ్గించడంతో పాటు ప్రభుత్వ ప్రజా రవాణా ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొంది. అలాగే, వాల్‌పారై, టాప్‌సిలిప్, ఆనైమలై పులుల సంరక్షణా కేంద్రం వంటివి వాహనాల కాలుష్యం బారినపడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచింది. ఇందుకోసం ఈ-పాస్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొంది. ఈ నిపుణుల బృందం నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నవంబరు 1 నుంచి ఈ-పాస్ విధానాన్ని అమలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

'ఉంగళుడన్ స్టాలిన్'తో సమస్యలకు సత్వర పరిష్కారం



వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఎంకే కార్యదర్శి శ్రీనివాసన్

తిరుత్తణి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లో శనివారం డీఎంకే కార్యదర్శి అడ్వకేట్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఉంగళుడన్ స్టాలిన్ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో వెలియాగరం, తిరుమల రాజుపేట, సూరజ్‌పేట, కొళత్తూరు, రామచంద్రాపురం, వెంకటరాజుకుప్పం సహా పలు గ్రామాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంకే కార్యదర్శి శ్రీనివాసన్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉంగళుడన్ స్టాలిన్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగ చేసుకుంటున్నారని తెలిపారు, అనంతరం శిబిరంలో పాల్గొన్న 893 మంది నుండి వినతిపత్రాలు స్వీకరించిన ఆయన సత్వర పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు పట్టణ డీఎంకే కార్యదర్శి సెంథిల్‌కుమార్, డిప్యూటీ విలేజ్ డెవెలెప్మెంట్ అధికారి గోపి, డీఎంకే నిర్వాహకులు రవి సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ కార్మికుల ధర్నా



నినాదాలు చేస్తున్న విద్యుత్‌శాఖ కార్మికులు

ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ)లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ అన్నాసాలైలోని బోర్డు ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విద్యుత్ కార్మికుల కేంద్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కన్నన్ అధ్యక్షతన శనివారం ఉదయం నిర్వహించిన ఈ ధర్నాలో సుమారు వందమందికి పైగా కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ, టీఎన్‌ఈబీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల అకౌంట్స్ విభాగంలో సూపర్‌వైజర్లుగా పనిచేసిన 96 మంది అధికారులుగా పదోన్నతి పొందారని, వీరిలో 26 మంది పేర్లను జాబితాలో చేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. పదోన్నతి పొందినవారికి వేతనంతో పాటు కరువుభత్యాన్ని పెంచకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని ఆయన ఆరోపించారు.

రవాణా కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

● సీఐటీయూ అధ్యక్షుడు సౌందరరాజన్



ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికులపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందరరాజన్ ఆరోపించారు. విరుదునగర్ ప్రభుత్వ రవాణా సంస్థలో పరిచేస్తున్న కార్మికులు పాత పింఛన్ విధానం అమలు చేయాలి, వారసులకు ఉద్యోగావశాలు కల్పించాలి, పింఛన్‌దారులకు ప్రభుత్వ రాయితీ అందజేయాలి తదితర డిమాండ్లతో గత నెల 19వ తేదీ నుండి రిలే నిరాహారదీక్షలో పాల్గొంటున్నారు. వీరికి మద్దతు తెలుపుతూ సౌందరరాజన్ శుక్రవారం పోరాటంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రవాణా కార్మికులకు అందాల్సిన పథకాలు 9యేళ్లు గడిచినా అందజేయకుండా డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని, అదేవిధంగా పింఛన్‌దారులకు కూడా 9యేళ్లుగా కవురుభత్యం ఇవ్వలేదని ఆరోపించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో రవాణా కార్మికులకు జరిగిన నష్టం ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో కూడా కొనసాగుతోందని, ప్రభుత్వాలు మారినా శ్రమజీవులకు మాత్రం తగు ఫలితం దక్కడంలేదన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



విద్యార్థులతో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పరిధిలోని పూనిమాంగాడు పంచాయతీలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని శనివారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, పూనిమాంగాడులోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని ప్రజలు విజ్ఞప్తి చేశారన్నారు. దీనిపై రాష్ట్రప్రభుత్వానికి తెలుపగా గ్రామంలో పాఠశాల నిర్మాణానికి అనుమతులు జారీచేశారన్నారు. ఈ నేపథ్యంలో, నూతనంగా నిర్మించిన పాఠశాలను శనివారం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సహా స్థానిక డీఎంకే నేతలు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టిలో ఓ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉసిలంపట్టి నేతాజీ నగర్‌లో తంగరాజ్ (86) అనే రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, పవలకొడి (76) దంపతులు నివశిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. అయితే శనివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో పవలకొడి ఆకస్మికంగా మృతి చెందింది. భార్య వియోగాన్ని తట్టుకోలేక తంగరాజ్ విలపించడంతో ఆయనను బంధువులు ఓదార్చుతుండగా, ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. దీంతో ఆ కుటుంబంతో పాటు స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. అనంతరం ఆ దంపతులు అంత్యక్రియలను ఒకేసారి పూర్తిచేశారు.

ఆన్‌లైన్ కోర్సులపై అప్రమత్తం

● విద్యార్థులకు యూజీసీ సూచన

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ కోర్సుల్లో చేరే ముందు విద్యా సంస్థల గుర్తింపును విద్యార్థులు పరిశీలించాలని యూజీసీ సూచించింది. యూజీసీ కార్యదర్శి మనీష్ ఆర్. జోషి విడుదల చేసిన ప్రకటనలో... ఉన్నత విద్యా సంస్థల్లో, ఆన్‌లైన్, దూర విద్యా కోర్సుల్లో అడ్మిషన్లు అక్టోబరు 15వ తేది వరకు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు https://deb.ugc.ac.in అనే వెబ్‌సైట్‌లో గుర్తింపు పొందిన విద్యా సంస్థల జాబితా పొందవచ్చన్నారు. తమిళనాడులోని సేలం పెరియార్ విశ్వవిద్యాలయం, సురేష్ జ్ఞాన విహార్ డెంటల్ స్కూల్ తదితర విద్యా సంస్థల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరంలో ఆన్‌లైన్ కోర్సులపై నిషేదం విధించామన్నారు.

చెన్నై ప్రజల కోసం మరో తాగునీటి పథకం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



నీటి సరఫరాను పరిశీలిస్తున్న సీఎం

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహా నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు అదనంగా 265 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం ప్రారంభించారు. ఈ నీటిని చెన్నై నగర వాసులకు మాత్రమే కాకుండా, ఆవడి కార్పొరేషన్, పూందమల్లి, మాంగాడు మున్సిపాలిటీ, తిరుమళిసై పట్టణ పంచాయతీలకు సరఫరా చేస్తారు. ఇందుకోసం చెంబరంబాక్కం చెరువు నుంచి రూ.66.78 కోట్లతో పైపుల నిర్మాణం పూర్తి చేశారు. కాగా, తొలి రాజేంద్ర చోళన్ నిర్మించిన 500 యేళ్ళనాటి ఈ పురాతన చెరువ కట్ట 9 కిలోమీటర్ల పొడవుంటుంది.

మెదడు నిర్జీవమైన జాలరి అవయవదానం



సంతోష్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన జాలరి, తన అవయవాల ద్వారా మరికొందరికి పునర్జన్మ ప్రసాదించారు. తిరువళ్లూర్ జిల్లా పులికేట్టు చిన్నమ్మన్ ఆలయ వీధికి చెందిన జాలరి సంతోష్ (40), భార్య చామంతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, తల్లితో కలసి జీవిస్తున్నాడు. ఈ నెల 11వ తేది ఎన్నూర్‌లో పని పూర్తిచేసుకుని బైక్‌పై ఇంటికి తిరిగొస్తుండగా థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతడిని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక 18వ తేది మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సలహా మేరకు సంతోష్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో, శస్త్రచికిత్స ద్వారా అవయవాలను వెలికితీశారు. అనంతరం సంతోష్ మృతదేహానికి ఆస్పత్రి అధికారులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది నివాళులర్పించారు.

13న ఎస్పీ వేలుమణి కేసు తుది విచారణ

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో పురపాలక శాఖ మంత్రిగా వ్యవహరించిన ఎస్పీ వేలుమణి హయాంలో చెన్నై, కోవై కార్పొరేషన్లలో పనులకు సంబంధించిన ఒప్పందాల్లో, రూ.98.25 కోట్ల మేర అవినీతి జరిగిందని ఏసీబీ కేసు నమోదుచేసింది. ఈ కేసు రద్దు చేయాలని ఓ సంస్థ దాఖలుచేసిన పిటిషన్ తోసిపుచ్చిన మద్రాసు హైకోర్టు, ఛార్జిషీటు దాఖలుచేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు అమలుచేయలేదంటూ, పిటిషన్‌దారులైన అరప్పోర్ ఇయక్కం కోర్టు ధిక్కరణ కేసు దాఖలుచేసింది. ఈ కేసులో పోలీసు శాఖ దాఖలుచేసిన అఫిడవిట్‌లో, టెండర్ మోసం కేసులో మాజీ మంత్రి వేలుమణి పేరు మళ్లీ చేర్చారు. అలాగే, ఈ కేసులో ఇద్దరు ఐఏఎస్ అధికారులకు వ్యతిరేకంగా కేసు దాఖలుకు కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ కేసు శుక్రవారం మళ్లీ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ విచారించారు. పోలీసు శాఖ దాఖలుచేసిన అఫిడవిట్‌పై అరప్పోర్ ఇయక్కం కూడా అఫిడవిట్ దాఖలుచేసింది. ఈ అఫిడవిట్‌కు సమాధానం చెప్పేందుకు అవకాశం కల్పించిన న్యాయమూర్తి, ఈ కేసు విచారణ అక్టోబరు 13కు వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రైలులో మత్తు బిళ్లల తరలింపు: ఇద్దరి అరెస్ట్

తిరుత్తణి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రైలులో మత్తు బిళ్లలను తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి రైల్వేస్టేషన్‌లో మాదకద్రవ్యాలు తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి ముంబయి నుండి చెన్నై ఎగ్మోర్‌కు వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమాస్పదంగా ఇద్దరు యువకుల బ్యాగులు తనిఖీ చేయగా, అందులో 1,445 మత్తు బిళ్లలు, గంజాయి తదితర మాదకద్రవ్యాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిద్దరు తాంబరం ప్రాంతానికి చెందిన శక్తివేల్ (26), దినకరన్ (22)గా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు టీచర్ల మృతి

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతిచెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. నెహ్రూ ఇండోర్ స్టేడియంలో కొత్తగా నియమితులైన డిగ్రీ టీచర్ల అభినందన సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఉదయం 5 గంటలకు విల్లుపురం నుంచి శివరంజని (38), సాహుల్ హమీద్ (52), ఆయన భార్య మెహరున్నీసా, పూవిళి, కౌసల్య, బంధువులు ప్రకాష్, చిన్నసేలం మురుగన్, సూర్య తదితరులు బయల్దేరారు. విల్లుపురం బైపాస్ రోడ్డులో అయ్యూర్ అగరం ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో వాహనాలను రాకపోకలను మళ్లించారు. టీచర్లు వస్తున్న కారును చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో, శివరంజిని ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఆమె విల్లుపురం జిల్లా కారపైపెరిచ్చానూరు ప్రభుత్వ పాఠశాలలో డిగ్రీ టీచర్‌గా ఇటీవలే నియమితులయ్యారు. సమాచారం అందుకున్న విల్లుపురం తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, అక్కడ చికిత్స ఫలించక సాహుల్ హమీద్ మృతిచెందాడు. ఆయన తిరుచ్చిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న విద్యార్థి సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ ప్రాంతంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న విద్యార్థి సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పోరూర్ టోల్ ప్లాజా సర్వీస్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒకే బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులను ఆపి ప్రశ్నించగా వారు సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో, వారి బ్యాగులు తనిఖీ చేయగా మత్తు బిల్లలు, గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... అయ్యప్పన్‌తాంగళ్ ప్రాంతానికి చెందిన చరణ్‌రాజ్, పోరూర్‌కు చెందిన రషీద్, నూంబల్ ప్రాంతానికి చెందిన జమున కుమార్ అని తెలిసింది. వీరిలో రషీద్ ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడని, పొరుగు రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలు నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడని తెలిసింది. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు.

రాజపాళయం వద్ద రెండు బస్సుల ఢీ

● 8 మందికి గాయాలు



ఘటనలో ధ్వంసమైన బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజపాళయం సమీపంలో ప్రభుత్వ బస్సు, కళాశాల బస్సు ఢీకొన్న ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రభుత్వ బస్సు పూర్తిగా ధ్వంసమైంది. విరుదునగర్ జిల్లా రాజపాళయం పాత బస్టాండ్ నుంచి మంజాపురం గ్రామానికి ఆర్డినరీ బస్సు శనివారం ఉదయం బయల్దేరింది. రాజేంద్రన్ నడుపుతున్న బస్సులో కండక్టర్ చోళైరాజన్, ఏడుగురు మహిళలున్నారు. మదురై-కొల్లం జాతీయ రహదారిలోని కాయల్‌కుడి మార్గం వెళ్తున్న బస్సును శ్రీవిల్లిపుత్తూరు నుంచి రాజపాళయం వైపు వెళ్తున్న ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ప్రభుత్వ బస్సు కుడి భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సులో ప్రయాణిస్తున్న మిల్లు కార్మికులు శ్వేత, బృంద, సెల్వి, సీతాలక్ష్మి, సీనియమ్మాళ్, రాముత్తాయ్, ప్రభుత్వాసుపత్రి నర్సు హసన్‌భాను తదితరులకు గాయాలయ్యాయి. కళాశాల బస్సు నడుపుతున్న శివగంగ జిల్లా మానామధురైకి చెందిన శేఖర్ కూడా గాయపడ్డాడు.. సమాచారం అందుకున్న రాజపాళయం ఉత్తరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ప్యారీస్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేటలోని కుమరప్పమేస్త్రి వీధిలో వెంకటేశ్వరస్వామి సేవా సమాజం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ సమాజం 4వ వార్షిక పురటాసి తొలి శనివారం సందర్భంగా కుమరప్పమేస్త్రివీధిని పూలు, పండ్లు, అరటి, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. పురోహితులు వడ్డి వెంకటేశ్వర్లు గణపతి పూజతో వేడుకలు ప్రారంభించారు. శ్రీవారికి అర్చన, అలంకారం, హారతి, ప్రసాద నివేదన చేశారు. సమాజం నిర్వాహకులు ఆకుల ఆదినారాయణ, సర్వేపల్లి మల్లిఖార్జున్, బాలు హేమంత్‌కుమార్, కె.రవి, జి.అనిల్, బి.సోమశేఖర్, ఎ.చరణ్, జి.శ్రీనివాసులు, పి.దయాకర్, పి.సతీష్, ఎం.సుబ్రమణ్యం, ఎన్.చంద్రు, పి.మురళి, పి.శేఖర్, బి.చంద్రశేఖర్, ఎ.దామోదరం, నోరు సుబ్రమణ్యం, వై.చంద్రశేఖర్, జి.వెంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఫుడ్ కాంపిటీషన్‌కు విశేష స్పందన



ప్రదర్శన ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేషన్ (సికా) ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన వంటలు, ఆహారం పోటీలకు విశేష స్పందన లభించింది. నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన ప్రత్యేక ఆహార ప్రదర్శన ఆదివారం వరకు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వాహకులు వంటల పోటీలను కూడా ఏర్పాటు చేశారు. భారత్‌తో పాటు మాల్దీవులు, మారిషస్, శ్రీలంక, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన 3 వేల మందికి పైగా చెఫ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిరోజూ నిర్వహించే ఈ పోటీల విజేతలకు బంగారు పతకాలు కూడా ప్రదానం చేస్తున్నారు.

ఎల్జీ ద్వారా 'డిమాండ్ మ్యాచ్' సిస్టమ్ ఆవిష్కరణ



మీడియా సమావేశంలో నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ కంపెనీల్లో ఒకటైన ఎల్జీ ఎక్విప్‌మెంట్స్ 'డిమాండ్-మ్యాచ్' సిస్టమ్ ఆవిష్కరించింది. శుక్రవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ ఎండీ డాక్టర్ జైరాం వరదరాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.వేణు తదితరులు దీనిని చెన్నై మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇది హెచ్చుతగ్గుల డిమాండ్‌లో స్థిర-వేగ కంప్రెసర్ ఎలా పని చేస్తాయో మార్చే ఒక అద్భుతమైన ఆవిష్కరణ అని తెలిపారు.

విజయ్ నివాసం వద్ద భద్రతా లోపం

● పోలీస్ అధికారుల సమీక్ష

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో, టీవీకే అధ్యక్షుడు విజయ్ నివాసం వద్ద ఏర్పడిన భద్రతా లోపంపై నీలాంకరై పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. ఇదే విషయంపై విజయ్‌కు కేంద్రం కేటాయించిన 'వై' కేటగిరీ భద్రతా అధికారులను విచారించారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే విజయ్ ఇంటి టెర్రస్‌పైకి అగంతుకుడు ఎలా వచ్చాడు? సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారు? తదితర అంశాలపై ఆరా తీశారు. స్థానిక నీలాంకరై లోని విజయ్ ఇంటి టెర్రస్‌పైకి అరుణ్ అనే యువకుడిని గుర్తించి పోలీసులకు అప్పగించిన విషయం తెల్సిందే. ఆ యువకుడికి మతిస్థిమితం లేదని, పైగా విజయ్‌ను చూడాలన్న ఏకైక లక్ష్యంతోనే విజయ్ ఇంటి వెనుక చెట్టెక్కి ఇంటి ప్రహరీగోడ దాటి వచ్చినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు వీలుగా పోలీసులు ఇంటి భద్రతపై సమీక్ష చేసి, తగిన చర్యలు చేపట్టనున్నారు.

తల్లి మనసు..!

లేగదూడకు పాలిస్తున్న శునకం



చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లిని కోల్పోయి అల్లాడిపోతున్న ఓ లేగదూడను దరి చేర్చిందో శునకం. తల్లిలా లాలిస్తూ, మూడు పూటలా పాలిస్తూ దానితో సరదాగా ఆడుకోవడం చూసి చుట్టుపక్కల వారు ముక్కున వేలేసుకుంటున్నారు. కోయంబత్తూర్ పుట్టువిక్కిరోడ్డులో వున్న స్వయంభు జలకంతేశ్వర సిద్ధర్ పీఠంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ పీఠంలో ఓ లేగదూడ ఇటీవల తల్లిని కోల్పోయింది. అప్పటి నుంచి ఆ శునకం ఈ లేగదూడ దగ్గరకు వస్తోంది. అది రాగానే ఈ లేగదూడ దగ్గరకు వెళ్లి పొదుగు నుంచి పాలు తాగుతోంది. ఈ దృశ్యాలను చూసి భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు.

టీవీకే జిల్లా కార్యదర్శి హత్యకు కుట్ర

● నలుగురి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీవీకే జిల్లా కార్యదర్శి హత్యకు కుట్ర పన్నిన అదే పార్టీకి చెందిన ఒక నేత సహా ముగ్గురు కిరాయి రౌడీలను తిరువళ్ళూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. కొడుంగయూరు ముత్తమిళ్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రభు (36) టీవీకే పార్టీ తిరువళ్ళూరు జిల్లా (దక్షిణం) కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈయన హత్యకు అదే పార్టీకి చెందిన మరో వ్యక్తి కుట్ర పన్ని కిరాయి ముఠాతో కలిసి ప్లాన్ చేశారు. అయితే, ఈ ప్లాన్ వికటించడంతో కిరాయి ముఠా సభ్యులైన రంజిత్, ఆనంద్ బాబు, విఘ్నేష్ కుమార్‌లతో పాటు టీవీకే నేత ఇళంగోను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అనిరుధ్‌తో పోటీనా?

ఇప్పుడే కెరీర్ మొదలైంది

● సాయి అభయంకర్

చిత్రజ్యోతి



మీడియా సమావేశంలో చిత్ర బృందం

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు తనకు మధ్య పోటీ నెలకొందంటూ సాగుతున్న ప్రచారంపై యువ సంగీత దర్శకుడు సాయి అభయంకర్ స్పందించారు. ఆయన ఎంతో చేశారని, తాను ఇపుడే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టానని అన్నారు. ఆయన తాజాగా సంగీతం సమకూర్చిన చిత్రం 'బల్టి'. షాన్ నిగమ్, శాంతను భాగ్యరాజ్, ప్రీతి అస్రానీ, అల్ఫోన్స్ పుత్రన్, సెల్వరాఘవన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. తమిళం, మలయాళం తదితర భాషల్లో రూపుదిద్దుకుంది. ఉన్ని శివలింగం దర్శకుడు. ఈ చిత్ర బృందం శుక్రవారం రాత్రి నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో సంగీత దర్శకుడు సాయి అభయంకర్ మాట్లాడుతూ, 'అనిరుధ్ ఎంతో చేశారు. నేను ఇపుడే జర్నీ ప్రారంభించాను. మా మధ్య ఎలాంటి పోటీ లేదు. మీ అందరి ఆశీర్వాదాలతో నేను మరింత శ్రమిస్తూ పనిచేయాలనుకుంటున్నాను. ఇప్పటి దర్శకులంతా కొత్తవారిని ప్రోత్సహిస్తున్నారు. నేను కొత్తగా ఏదైనా ప్రయత్నించాలనుకుంటే వారు దానిని ఇష్టపడుతూ, వారివారి చిత్రాల్లో అమలు చేసేందుకు అనుమతిస్తున్నారు. అల్బమ్, సినిమాలకు పనిచేయడం అంతా ఒక్కటే' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ఉన్ని శివలింగం మాట్లడుతూ, 'మా నాన్న తమిళుడు. నేను మలయాళీ. మలయాళ వెర్షన్‌లో 60 శాతం మలయాళీలు, 40 శాతం తమిళులు ఉంటారు. కబడ్డీ క్రీడాకారులు ఆటలో ఎత్తులు పైఎత్తులు వేస్తూ ఒకరితో ఒకరు ఎలా పోరాడుతారన్నదే ఈ కథ. నాకు మళ్ళీ ఇలాంటి అవకాశం వస్తుందో రాదో తెలియదు. కానీ నా తొలి ప్రయత్నంలో ఒక మంచి చిత్రాన్ని తీశాను. మీరు కూడా ఆదరించాలి' అని కోరారు. ఎస్‌టీకే ఫ్రేమ్స్ బీను జార్జ్ అలెగ్జాండర్ ప్రొడక్షన్స్ పతాకంపై సంతోష్ డి.కురువిల్లా, బీను జార్జ్ అలెగ్జాండర్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

విజయ్‌కు కంప్లీట్ ఫేర్‌వెల్ మూవీ

● హెచ్.వినోద్



హెచ్.వినోద్ - విజయ్

విజయ్ హీరోగా తన దర్శకత్వంలో రూపొందుతున్న 'జన నాయగన్' మూవీ పక్కా ఫేర్‌వెల్ సినిమాగా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు హెచ్.వినోద్ అన్నారు. స్టార్ హీరో అజిత్‌తో 'వలిమై', 'తుణివు' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన హెచ్.వినోద్.. తాజాగా విజయ్‌తో 'జన నాయగన్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వచ్చే యేడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఈ సినిమా చిత్రీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రం గురించి ఆయన కామెంట్స్ చేస్తూ, 'నటుడు విజయ్‌కు 'జన నాయగన్' ఒక పక్కా ఫేర్‌వెల్ మూవీగా ఉంటుంది. మాస్, యాక్షన్, కమర్షియల్, కామెడీ ఇలా అన్ని అంశాలు సమపాళ్ళలో ఉంటాయి. అందుకే ఇది అభిమానులకు 'కంప్లీట్ మీల్స్' (విందు భోజనం)గా ఉంటుందని చెబుతాను' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్. ఇతర పాత్రల్లో బాబీ డియోల్, మమితా బైజు, ప్రియమణి తదితరులు నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం. కేవీఎన్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

దక్షిణ్ విజయ్ హీరోగా 'వెత్తు కాగితం'



దక్షిణ్ విజయ్ హీరోగా మరో కొత్త చిత్రం తెరకెక్కనుంది. 'వెత్తు కాగితం' పేరుతో మగిళ్ ప్రొడక్షన్స్ పతాకంపై సి.బ్యూలా నిర్మాణంలో మగిళ్ టీమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. సోదరి కోసం జీవించే తమ్ముడి కథ. నేటి యువత కోసం మంచి కథ. ఆప్యాయతలు, సెంటిమెంట్, హాస్యం అన్ని అంశాల మేళవింపుతో తెరకెక్కిస్తున్నారు. రైజింగ్ హీరో దక్షిణ్‌తో పాటు చాందిని, అప్పుకుట్టి, ఇమాన్ అన్నాచ్చి, సత్యం టీవీ ముక్తార్, కూల్ సురేష్, శ్రీధర్, జీవా, దీప, ఎం.బాలా, హలో కందస్వామి, నమో నారాయణన్, సత్య తదితరులు నటిస్తున్నారు. చెన్నై, పళని, కేరళలో చివరి దశ చిత్రీకరణ జరుపుకుంటుంది.

అజిత్ అలా అనడం బాధ కలిగించింది

● మహేశ్వరి



తాను ఎంతగానో ఇష్టపడిన అగ్రహీరో అజిత్... సినిమా షూటింగ్ చివరి రోజున చెల్లెమ్మా అని పిలిచి తన హృదయాన్ని ముక్కలు చేశారని నటి మహేశ్వరి అన్నారు. దివంగత నటి శ్రీదేవి పిన్ని కుమార్తె మహేశ్వరి. తమిళం, తెలుగు భాషల్లో హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించారు. భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన 'కరుత్తమ్మా' అనే చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత అజిత్, విక్రమ్ వంటి అగ్ర హీరోల సరసన నటించారు. ముఖ్యంగా అజిత్‌తో 'నేసమ్', 'ఉల్లాసం' వంటి చిత్రాల్లో నటించారు. ఈ రెండు చిత్రాల షూటింగ్ దాదాపు యేడాదిన్నర కాలం సాగింది. ఈ అనుభవంపై ఆమె తాజాగా స్పందిస్తూ, 'ఈ రెండు చిత్రాల షూటింగ్ ఒకే సమయంలో జరగడంతో అజిత్‌తో ఎక్కువ రోజులు గడిపే అవకాశం లభించింది. ఆ సమయంలోనే ఆయనపై నాకు అమితమైన క్రష్ ఏర్పడింది. అయితే, సినిమా షూటింగ్ చివరి రోజున... అజిత్ నా వద్దకు వచ్చి.. 'మహీ.. నీవు నాకు చెల్లెలువంటిదానికి. ఎపుడు ఏ అవసరం వచ్చినా ఏమాత్రం సంకోచం లేకుండా అడగొచ్చు' అని చెప్పి వెళ్ళిపోయారు. చెల్లి అనే మాట వినగానే నా హృదయం ముక్కలైంది' అని మహేశ్వరి వెల్లడించారు.

ఘనంగా 'హిట్స్' స్నాతకోత్సవం

2500 మందికి పట్టాల ప్రదానం





సీపీఎస్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్, ప్రొఫెసర్ రాజీవ్ అహూజా తదితరులు - స్నాతకోత్సవంలో అతిథులు, నిర్వాహకులతో ర్యాంక్ హోల్డర్లు

టి.నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పడూరు ప్రాంతంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్) 16 స్నాతకోత్సవం కేళంబాక్కం క్యాంపస్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఎరిట్రియా రాయబారి, డిప్లొమాటిక్స్ కార్ప్స్ (ఇండియా) డీన్ అలెం త్సేహాయే వోల్డెమారియం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్, నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) డీఆర్‌డీఓ డైరెక్టర్ డాక్టర్ అబ్రహామ్ వర్గీస్, చెన్నై గ్లెనీగల్స్ హెల్త్‌సిటీ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.ఇమ్మాన్యుయేల్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.. ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, లా, మేనేజ్‌మెంట్ బేసిక్ అండ్ అప్లయిడ్ సైన్సెస్, లిబరల్ ఆర్ట్స్, హెల్త్‌సైన్స్ విభాగాలకు చెందిన 2500 మందికిపైగా గ్రాడ్యుయేట్లకు యూజీ, పీజీ డిగ్రీలు, పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. 88 మంది ర్యాంక్ హోల్డర్లకు పతకాలు, బహుమతులు అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథి అలెం త్సేహాయే వోల్డెమారియం, విశిష్ట అతిథులు రాజేష్ నంబియార్, డాక్టర్ అబ్రహామ్ వర్గీస్, హెల్త్‌సిటీ డాక్టర్ సి.ఇమ్మాన్యుయేల్‌కు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఈ వేడుకల సందర్భంగా హిట్స్ ప్రాంగణంలో సీపీఎస్ఎల్ (సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ లేబొరేటరీ)ని ఐఐటీ రోపర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్ అహూజా ప్రారంభించారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్.గణేశన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అగర్వాల్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

● ఎమ్మెల్యే ఎళిలన్ నాగనాథన్



సదస్సులో ఎమ్మెల్యే, వైద్యనిపుణులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఎళిలన్ నాగనాథన్ కొనియాడారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్, ఐ రీసెర్చ్ సెంటర్ ఫౌండేషన్ శనివారం పోస్ట్ గ్రాడ్యుయేట్ ఆప్తమాలజీ విద్యార్థుల కోసం 'కల్పవృక్ష' పేరుతో జాతీయ సదస్సు ప్రారంభించింది. 30 మందికి పైగా అధ్యాపకులు, 300 మందికి పైగా యువ వైద్యులు పాల్గొన్న ఈ సదస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించడంలో విద్యా, క్లినికల్ నైపుణ్యం కలిసి ఎలా పని చేస్తాయో కల్పవృక్ష అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. డాక్టర్ అగర్వాల్స్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ మాట్లాడుతూ... ప్రతి ఏటా తాము నేత్ర వైద్య విద్య అవసరాలను తీర్చడానికి కల్పవృక్షాన్ని మెరుగు పరుస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుందరి, డాక్టర్ దివ్య అశోక్ కుమార్, డాక్టర్ ప్రీతి నవీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వి.వేలాయుధం పురస్కారాన్ని డాక్టర్ శిఖా బిస్, డాక్టర్ జె.అగర్వాల్ ఎక్సంప్లరీ పురస్కారాన్ని డాక్టర్ ఎస్.సారాకు ప్రదానం చేశారు.

'చెన్నై బ్రెస్ట్ సెంటర్' ప్రారంభం



సీబీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'ది హెడ్ అండ్ నెక్ సెంటర్' హాస్పిటల్ ఆధ్వర్యంలో 'చెన్నై బ్రెస్ట్ సెంటర్' (సీబీసీ) ఏర్పాటైంది. ఇది సమగ్ర రొమ్ము ఆరోగ్య పరీక్ష, రోగ నిర్ధారణపై ప్రత్యేకగా దృష్టి సారించింది. నేచురల్స్ గ్రూప్ ఆఫ్ సెలూన్స్ వ్యవస్థాపకురాలు వీణా కుమారవేల్, రొమ్ము క్యాన్సర్ అవగాహనా ప్రచారకురాలు నీర్జా మాలిక్, సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సెల్వి రాధాకృష్ణ తదితరులు శనివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ సెంటర్ రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన పెంచడానికి ఈ నెల 28 వరకు ఉచిత కన్సల్టేషన్ అందిస్తుందన్నారు.

'ఇంటెగ్రల్ కప్' విజేతగా

మద్రాస్ ఐఐటీ విద్యార్థి



మాథేశ్వరన్‌కు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇంటిగ్రేషన్ బి మ్యాథమేటిక్స్ పోటీ 'ఇంటెగ్రల్ కప్' విజేతగా మద్రాస్ ఐఐటీ విద్యార్థి ఎస్.మాథేశ్వరన్ నిలిచాడు. బెంగళూరు ఐఐఎస్సీకి చెందిన తన్మయ్ బుద్ధా ద్వితీయ స్థానంలో, బిలాయ్ ఐఐటీ విద్యార్థి శోభిత్ జైన్ తృతీయ స్థానంలో నిలిచారు. ఇటీవల ముంబైలో జరిగిన ఈ పోటీల్లో ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ మద్రాస్, ఐఐఎస్సీ బెంగళూరుతో పాటు ఇతర ప్రముఖ సాంకేతిక సంస్థలకు చెందిన 3 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కఠినమైన క్యాంపస్ స్థాయి పోటీల నుంచి విజయం సాధించాక, 21 మంది ఫైనలిస్టులు చివరిదశలో పోటీపడ్డారు. ఈ పోటీలో అత్యుత్తమ ప్రదర్శనలకు రూ.19 లక్షల విలువైన బహుమతులు ఇచ్చినట్టు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా 'శ్రీహెర్' వ్యవస్థాపక దినోత్సవం



చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీ రామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (శ్రీహెర్) 40వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. శ్రీహెర్ వ్యవస్థాపక ఛాన్స్‌లర్ ఎన్‌పీవీ రామసామి ఉడయార్ 90వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులకు స్వర్ణ పతకాలు, పురస్కారాలు ప్రదానం చేశారు. ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు పీఆర్ వీణ, డాక్టర్ వి.సంజనలకు మూడు స్వర్ణ పతకాలు లభించాయి. అదే విధంగా మరో 33 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు, 67 మంది విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం చేశారు. వర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్ ప్రసూతి, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఉషారాణికి జీవిత సాఫల్య పురస్కారం, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎం వెంకటసాయికి మెంటరింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.ఏళుమలై, అనాటమీ విభాగంలో అటెండెంట్లు బి.ఆరోగ్యనాథన్, ఎన్.సుబ్రమణ్యన్, జి.డేవిడ్, విం.వెంగయ్య, చిన్న యోగయ్యలకు అత్యుత్తమ సేవా పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఛాన్స్‌లర్ వీఆర్ వెంకటాచలం, ప్రొ ఛాన్స్‌లర్ ఆర్‌వీ సెంగుట్టువన్, శ్రీ రామచంద్ర ఎడ్యుకేషనల్, హెల్త్ ట్రస్ట్ ట్రస్టీ సంయుక్త వెంకటాచలం, డాక్టర్ ఎస్.తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి కానుకగా ఎలక్ట్రిక్ బైక్



హైదరాబాద్‌కు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం రూ.1.10 లక్షల విలువైన బిగాస్ ఎలక్ట్రిక్ బైక్‌ను తిరుమల శ్రీవారికి కానుకగా అందజేసింది. టీటీడీ ఏఈవో మోహన్‌రాజుకు సంస్థ ఆర్ ఎస్ఎం రామారావు బైక్ తాళాలను అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



'ఓజీ' పెద్ద హిట్ కావాలి

● నిర్మాత డీవీవీ దానయ్య


ఈనెల 25న విడుదల కానున్న పవన్‌కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా పెద్ద హిట్ కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరానని ఆ చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కాగా శనివారం శ్రీవారిని ఉడిపిలోని పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామిజీ, ఢిల్లీ ఏపీ ప్రభుత్వ సలహాదారు ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తమిళ జాలర్ల బోటు పట్టివేత

వాకాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం సముద్ర తీరంలో అక్రమంగా వేట సాగిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన కరైకల్ జాలర్ల స్పీడ్ బోట్‌ను శుక్రవారం రాత్రి మత్స్యకారులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కరైకల్ ప్రాంతానికి చెందిన 16 మంది మత్స్యకారులు శ్రీనివాసపురం సముద్రతీరంలో చేపలను వేటాడుతుండగా స్థానిక జాలర్లు అడ్డుకుని బోట్‌ను అదుపులోకి తీసుకున్నారు. బోట్‌ను నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టులో అప్పజెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి చెన్నై రాష్ట్రానికి చెందిన స్పీడ్ బోట్ ఆంధ్రా తీరం వైపు రాకుండా చూడాలని కోరారు.

సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,249

తలనీలాలు సమర్పించినవారు: 22,901


ఈ రోగానికి మందేది?

- బ్రాండెడ్ షాపులోనూ నాణ్యత లేని మందులే
- తనిఖీల్లో వెల్లడైనా చర్యలు తీసుకోని టీటీడీ
- వైసీపీ హయాంలో మొదలై నేటికీ కొనసాగుతున్న అక్రమాలు

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు



తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆవరణలో మందుల మాయాజాలం నడుస్తోంది. బ్రాండెడ్ మందులు మాత్రమే విక్రయించాల్సిన షాపులో జనరిక్ మందులు, జన ఔషధి షాపులో బ్రాండెడ్ కంపెనీల మందుల విక్రయం జరుగుతోంది. ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందులకు బదులు నాసిరకం అంటగడుతున్నారు. వైద్య బృందాల తనిఖీలో మందుల బాగోతం తేలినా టీటీడీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో మొదలైన మందుల షాపుల అక్రమాలు ప్రభుత్వం మారినా కొనసాగుతుండడం విమర్శలకు దారితీస్తోంది.



స్విమ్స్‌లో ఇన్నోవేటివ్ ఫార్మా మందుల షాపులో క్వాలిటీ చెక్,రీ చెక్ చేసినా తప్పిదాలు సరిదిద్దుకోలేదని వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

ఇన్నోవేటివ్‌గా దోపిడీ!

స్విమ్స్ ఆవరణలో గతేడాది డిసెంబరులో ఇన్నోవేటివ్ ఫార్మాసూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ మందుల షాపు వెలిసింది. కేటగిరీ పరంగా ఇందులో బ్రాండెడ్ కంపెనీల మందులు విక్రయించాలి. ఈ షాపు నెలవారీ అద్దె రూ.31 లక్షలంటే వ్యాపార స్థాయి ఊహించవచ్చు. అధిక ఖరీదు కలిగిన మందులు విక్రయిస్తున్నా చాలామటుకు నాసిరకమనే ఆరోపణలున్నాయి. ఈనెల 6వ తేదీన బక్కయ్య(64) అనే రోగికి వైద్యులు నాలుగు రకాల మందులు రాశారు. అందులో ఎకోస్ప్రిన్ మాత్రల బదులు నాణ్యత లేని ఎకోప్రిల్ విక్రయించారు. స్ట్రోక్ వస్తే మెదడులో రక్తం గడ్డ కట్టకుండా ఉండడానికి ఈ మాత్ర ఉపకరిస్తుంది. నాసిరకం మాత్రల వల్ల అనర్థం సంభవించే ప్రమాదముంది. ముపిరోసిన్ అనే ఆయింట్‌మెంట్ బదులు టి.మ్యూస్ క్రీమ్ అనే నాసిరకం విక్రయించారు. స్టిలోజ్ ట్యాబ్‌లెట్ రాస్తే నాణ్యత లేని సిలోబాక్ట్ ఇచ్చారు. ట్రీటిల్ మాత్ర బదులు పెరిటాల్ అనే నాసిరకం మాత్ర ఇచ్చారు. గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న కె.జయమ్మకు కూడా వైద్యులు రాసిన నాణ్యమైన మందులకు బదులు నాణ్యతలేని మందులు ఇచ్చారు. దీంతో ఆరోగ్యం క్షీణించి ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యుల ద్వారా నిర్ధారించుకున్న జయమ్మ కుటుంబీకులు గత నెల 22న స్విమ్స్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ షాపుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి.

రెండవ తనిఖీలోనూ అవే తప్పిదాలు

వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినా ఈ షాపుపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.దీంతో రెండోసారి అంటే మే 9న వైద్యుల బృందం మళ్లీ తనిఖీ చేసింది.మునుపు గుర్తించిన తప్పిదాలను సరిదిద్దుకోలేదని తేల్చింది. అదనంగా మరిన్ని ఉల్లంఘనలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది. అయినా ఈ దుకాణంపై చర్యలు తీసుకోలేదు.



స్విమ్స్ జన ఔషధి షాపులో తనిఖీలు చేపట్టి అక్రమాలపై వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

5 శాతమే జనరిక్ మందులు

స్విమ్స్ ఆవరణలో ఓపీడీ బ్లాకు వద్ద వెలుపల బర్డ్ భవనంలో పీఎంబీజేకే పథకం కింద ఈ ఏడాది జూన్‌లో జన ఔషధి షాపు ఏర్పాటైంది. దీని నెలవారీ అద్దె రూ.5 లక్షలు. ఇందులో 90 శాతం జనరిక్ మందులు ఉండాలి. తక్కువ ధరలకు విక్రయించాలి. అయితే బ్రాండెడ్ పేరిట నాసిరకం మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండడంతో గత నెల 23న ఏడుగురు సీనియర్ వైద్యుల బృందం తనిఖీ చేసింది. జనరిక్ మందులు 5 శాతం మాత్రమే ఉన్నాయని గుర్తించింది. ధరలు కూడా జన ఔషధి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నట్టు తేలింది.

వైసీపీ హయాంలోనే అక్రమాలకు బీజం

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే టీటీడీలో అప్పటి కీలక వ్యక్తి సిఫారసుతో స్విమ్స్ ఓపీడీ బ్లాకులో రోగుల వెయిటింగ్ హాలును మందుల షాపుగా మార్చేశారు. అక్కడ పీఎంబీజేకే పథకం జన ఔషధి షాపు పెట్టారు. నెలవారీ అద్దె కేవలం రూ.20 వేలుగా నిర్ణయించారు. అక్కడ రోజువారీ వ్యాపారం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల దాకా జరిగేది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బ్రాండ్లుగా కంపెనీల పేర్లు చూపి అధిక ధరలకు నాసిరకం మందులు విక్రయించారన్న ఫిర్యాదులు వచ్చాయి. అయినా చర్యలు తీసుకోకపోగా ఏటా పది శాతం అద్దె పెంపుతో ఐదేళ్లు షాపును కొనసాగించారు. 2023 ఆగస్టులో సంబంధిత టీటీడీ కీలక వ్యక్తి పదవి నుంచి తప్పుకోబోయే ముందు ఈ షాపు లైసెన్స్ గడువును 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31వరకు ఏకంగా మూడేళ్ల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో ఈ షాపు మూతపడింది. వైసీపీ కీలక నేత సిఫారసుతో ఈ షాపును బినామీ పేరుతో దక్కించుకున్న వ్యక్తి ఆ వెంటనే అదే నెలలో ఇన్నోవేటివ్ ఫార్మా పేరిట బ్రాండెడ్ మందుల షాపు ఏర్పాటు చేశారు. తర్వాత ఆరు నెలల వ్యవధిలోనే బినామీ పేరుతో జన ఔషధి షాపు తెరిచారు.

కీర్తి బ్రాండెడ్ షాపులో నాసిరకం మందులు


బర్డ్ ఆస్పత్రి భవనంలో కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న బ్రాండెడ్ మందుల షాపు వ్యవహారం కూడా వివాదాస్పదంగా ఉంది. ఈ షాపు నెలవారీ అద్దె రూ.18 లక్షలు. స్వల్ప కాలంలోనే ఈ షాపుపై ఫిర్యాదులు రావడంతో స్విమ్స్, బర్డ్ ఉన్నతాధికారులు గత నెల 23న తనిఖీ చేశారు. బ్రాండెడ్ మందులకు బదులు జనరిక్ మందులే ఉండడాన్ని గుర్తించారు.వాటిని తొలగించి 90శాతం మందులు బ్రాండెడ్ మందులు ఉంచాలని ఆదేశించారు.దీనిపై గత 25న బర్డ్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా టీటీడీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

తొలి తనిఖీలో వాస్తవాలుగా తేలిన ఆరోపణలు

ఫిర్యాదులు తరచూ వస్తుండడంతో స్విమ్స్ వైద్యుల బృందం ఈ ఏడాది ఏప్రిల్ 15న ఇన్నోవేటివ్ షాపులో తనిఖీలు చేపట్టారు. బ్రాండెడ్ కేటగిరీకి అనుమతి ఇవ్వగా 80 శాతం జనరిక్ మందులే ఉన్నట్లు గుర్తించారు. హై రిస్క్ మందులు, అత్యవసర మందులను విడివిడిగా నిల్వ చేయడం లేదని గుర్తించారు. గడువు సమీపిస్తున్న మందులను కూడా సాధారణ మందులతో పాటు కలిపే ఉంచుతున్నట్టు గమనించారు. ఈ లోపాలతో పాటు రూమ్ టెంపరేచర్ ప్రోబ్ కూడా పనిచేయడం లేదని వైద్యుల బృందం స్విమ్స్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది.

ఐసర్‌లో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అకడమిక్ సహకారాన్ని బలోపేతం చేయడమేగాక యువ పరిశోధకులకు వేదిక కల్పిస్తామని ఐసర్ ప్రతినిధులు చెప్పారు. మండలంలోని తిరుపతి ఐసర్ ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, జర్మనీ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్, శ్రీలంకలకు చెందిన డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్ల నెట్‌వర్క్ సహకారంతో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం నిర్వహించారు. ఇంటిగ్రేటివ్ బయోసైన్సెస్ - డేటా డ్రివన్ డిస్కవరీ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో బయాలజీ డేటా సైన్స్ రంగాల అనుసంధానంపై ప్రసంగాలు, చర్చలు జరిగాయి. వ్యక్తిగత వైద్య పద్ధతులు, వ్యాధి అంచనాలు, శాస్త్రీయ ఆవిష్కరణల్లో డేటా సైన్స్ పాత్రపై ప్రధానంగా దృష్టి పెట్టారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలపై డాక్టర్ నాగరాజు గణపతి(ఐఐటీ హైదరాబాద్), డాక్టర్ శ్రీయా శ్రీనివాసన్(హార్వర్డ్ యూనివర్శిటీ) వివరించారు. ఔషధ ఆవిష్కరణలు, ట్రాన్స్‌లేషనల్ సైన్స్, మేధో సంపత్తి హక్కులపై డాక్టర్ అంబ్రిస్ సక్సేనా, డాక్టర్ రఘునాథ్, ఓ.రామభద్రన్ (తిరుపతి ఐసర్) చర్చించారు. మాలిక్యూలర్ బయాలజీ, డేటా మైనింగ్‌పై డాక్టర్ శృతి ఎస్ వెంబర్(ఐబీఏబీ, బెంగళూరు) ఉపన్యసించారు. తిరుపతి ఐసర్ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి దేవనాథన్, తిరుపతి ఐఐటీ ప్రతినిధి డాక్టర్ పంచచారం మారియప్పన్, డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపోలో, ఎస్వీ, పద్మావతి మహిళా యూనివర్శిటీలు, తిరుపతి ఐఐటీ, ఐసర్ నుంచి వచ్చిన 200మందిపైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జర్మనీలో లభించే పరిశోధన అవకాశాలను డీఏఏడీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. ఐసర్ రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ క్లోహ్, లెఫ్టినెంట్ కల్నల్ హిమాంశు శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దొంగలు చొరబడుతున్న సీసీ కెమెరా ఫుటేజీ

ఇంట్లో దొంగల బీభత్సం

● కత్తులతో బెదిరించి దోపిడీ

● రూ.70వేల నగదు, 100 గ్రాముల బంగారు ఆభరణాల అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కాశిపెంట్లలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. కత్తుల బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు .. గ్రామంలోని ఓ ఇంట్లో గల్లా నాగేశ్వరనాయుడు, భార్య సుశీల, ఆయన తల్లి ద్రౌపది ఉన్నారు. వీరి కుమారుడు ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటలకు నాగేశ్వరనాయుడు దంపతులు తమ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల కారులో ఇంటి ముందుకు వచ్చారు. గేటు ముందు హారన్ కొడుతుండటంతో సుశీలమ్మ వెళ్లి తలుపు తీసేందుకు ప్రయత్నిస్తుండగానే ఇంటి వెనుక వైపు నుంచి ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు లోనికి ప్రవేశించారు. ద్రౌపది చేతులు తువ్వాలు కట్టేసి, నాగేశ్వరనాయుడు, సుశీలమ్మలకు కత్తులు చూపించి బెదిరించారు. కప్‌బోర్డులో ఉన్న రూ.70 వేల నగదు, వంద గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నారు. ఫోన్లో మాట్లాడుతున్న కుమారుడు ప్రశాంత్ ఇక్కడి అలజడిని గమనించాడు. దొంగలు పడ్డారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వెంటనే గ్రామంలో తెలిసిన కొందరికి ఫోన్ చేశాడు. గ్రామస్తులు చేరుకుని కేకలు వేస్తూ రావడంతో దొంగలు కారులో పరారయ్యారు. గ్రామస్తులు 100కి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది చేరుకుని దుండగులు కోసం గాలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించింది. బాధితుడు నాగేశ్వరనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖి నదిలో వృద్ధుడి గల్లంతు



పాపయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది దాటుతూ ఓ వృద్ధుడు గల్లంతయిన ఘటన మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చమర్తి పాపయ్య (65) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది దాటే ప్రయత్నం చేశాడు. ఇటీవల తెలుగుగంగ జలాలను స్వర్ణముఖి నదికి వదలడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఆ విషయం తెలుసుకోలేకపోయిన పాపయ్య నదీ ప్రవాహానికి కొట్టుకుపోయాడు. చీకటి పడే వరకు స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం అగ్నిమాపకదళ సిబ్బందితో కలసి గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామన్నారు.

ఈత సరదాకు బాలుడి మృతి

● మరొకరి గల్లంతు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో బాలుడు గల్లంతయ్యాడు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపిన వివరాలు... పట్టణంలోని ఓటేరు కాలువ వీధికి చెందిన నాజర్ ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు హారున్(8) ముత్యాలమ్మ గుడి వీధి పురపాలక సంఘ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం దోబీఘాట్‌కి చెందిన గుణ(14) మరో నలుగురు పిల్లలతో కలిసి మొత్తం ఆరుగురు శనివారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లారు. పట్టణంలోని దోబీఘాట్ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో ఈత కొడుతుండగా హారున్, గుణ నీటి వేగంతో కొట్టుకు పోయారు. మిగతా నలుగురు పిల్లలు కేకలు వేయడంతో సమీపంలో ఓ పురపాలక సంఘ పారిశుధ్య కార్మికుడు అరుణ్ హారున్‌ను ఒడ్డుకు చేర్చాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గల్లంతైన గుణ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ హారున్ మృతదేహం - గుణ (ఫైల్‌ఫొటో)

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్



తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రణాళికలు పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ చేతననంద్ సింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం స్టేషన్ దక్షిణం వైపు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి, ప్రయాణికుల అవసరాల మేరకు పనులు ఉండేలా చూడాలని ఆదేశించారు. నూతన భవనాల్లో వ్యాపార పరమైన అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, డిప్యూటీ సీఈ వామనరావు, డి.ప్రభాకర్, మాధవరావు పాల్గొన్నారు.

సందడిగా కళాంగిని వేడుక

● ఐఐటీలో ఆర్ట్ వర్క్‌షాప్ విజయవంతం



పెయింటింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఐఐటీ, ఐసర్ విద్యార్థులతో ఆర్టిస్టులు

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ సందడిగా సాగింది. ఐఐటీకి చెందిన ఆర్టిస్టా.. ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో తలపెట్టిన కళాంగిని వేడుక మొదటి రోజైన శనివారం ఉల్లాసభరితంగా సాగింది. ఐఐటీ, ఐసర్‌లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుపతికి చెందిన మహిళా ఆర్టిస్టులు రాగిమాను శ్రీదేవి, జి.గాయత్రి, బత్తుల అర్చన, ఎస్.లావణ్య పాల్గొని విద్యార్థులకు పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఫ్లోరల్, సీనరీ, పాట్ అడోర్న్మెంట్, పేపర్ డెకార్ తదితర అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్వవ్, ఆర్ట్ క్లబ్ హెడ్ ఆర్యా రుబీన్, మెంటార్ రోహన్ రతన్, క్లబ్ సభ్యులు బీఎస్ఎన్ కౌశిక్, రిషికేష్ రెడ్డి, సాత్విక్ పిల్యానం, హర్షవర్ధన్, రూబితా రంగనాథన్, సిద్ధార్థ గుంటూరు, నాగశ్వేత, శ్రీవర్షిని, రుతిక, మేఘ్ మెహతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జెండా ఉత్సవాలకు గూడూరు ముస్తాబు





గమ్మళ్లపాళెంలో విద్యుత్ దీపాలంకరణ

గూడూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా విజయదశమికి ముందు వచ్చే అమావాస్య నాడు పట్టణంలో ఆంజనేయస్వామి జెండాలను ఊరేగించడం ఆనవాయితీ. పట్టణంలో సుమారు 40కి పైగా ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా గమళ్లపాళెం, మిట్టపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్‌దీపాలతో వివిధ దేవుళ్ల కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీధులన్నీ విద్యుద్దీపాలకరణతో శోభాయమానంగా మారాయి. ఆదివారం ఉదయం ఆంజనేయస్వామి జెండాలకు పూజలు నిర్వహించి వీధుల్లో ఊరేగిస్తారు. తరువాత ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రి ఈ గ్రామోత్సవంలో తప్పెట్లు, తాళాలు, జింగిరి మేళాలు, కాంతార, బేతాళ నృత్యాలు, కోలాటాలు, తెనాలిబ్యాండు, కేరళ వాయిద్యాలు నడుమ ఆంజనేయస్వామి జెండాలకు గ్రామోత్సవం జరుపుతారు.

కబడ్డీ పోటీల్లో వెరిటాస్ ప్రతిభ



పాఠశాలకు చెందిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందిస్తున్న చైర్మన్ శేషారెడ్డి

ములుగు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని గెలుచుకున్నారని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులను, కోచ్‌లు శంకర్, నరేశ్‌లను ఆయన సన్మానించి, అభినందించారు. బీహార్ రాష్ట్రం రోహతక్‌లోని నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో ఈ నెల 13 నుంచి 17వరకు జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్-17 బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించగా, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుంచి ఫైనల్‌కు చేరారు. శ్రీగురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 45-52 పాయింట్స్‌తో వెనుకబడి రన్నర్స్‌గా నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు కబడ్డీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి ఇప్పటివరకు ఎవరూ సాధించని జాతీయ స్థాయి పతకాన్ని సాధించారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ యస్. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 18మంది స్మగ్లర్లను అరెస్టు చేసింది. 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, గొడ్డళ్ల బరిసెలు, రంపపు చుట్టలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టింది. తెల్లవారుజామున పెద్దశెట్టిపల్లి వద్ద రెండు కార్లు వేగంగా వస్తూ కనిపించాయి. పోలీసులను గమనించి వాహనాలు పక్కకు ఆపి దిగిపారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వెంబడించి 18మందిని పట్టుకున్నారు. కార్లు తనిఖీ చేయగా 16 ఎర్రచందనం దుంగలు, నాలుగు పిడిలేని గొడ్డళ్లు, నాలుగు పిడిలేని బరిసలు, రంపపు చుట్టలు దొరికాయి. స్మగ్లర్లతో పాటు వాటిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రచయిత, అనువాదకుడు జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం ప్రకటించారు. పడైప్పు అనే తమిళ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఈ ఏడాది ప్రకటించిన ఐదు పురస్కారాల్లో ఇలక్కియ చుడర్ పురస్కారం బాలాజీని వరించింది. వివిధ సాహితీ ప్రక్రియల్లో విశేష కృషి చేసే రచయితలకు ఈ అవార్డులను ఇస్తారు. ఈ నెల 27న చెన్నైలో నిర్వహించే సభలో పురస్కారం అందజేస్తారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న జిల్లేళ్ల బాలాజీ 130 కథలు రాశారు. 11 నవలలు, ఒక కవితా సంపుటి ప్రకటించారు. పలు కథలు నవలలు తమిళం నుంచి తెలుగులోకి అనువదించారు.